క్లుప్తంగా

రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

మునిపల్లి(అందోల్): మునిపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీంచారు. మునిపల్లి మాజీ ఉపసర్పంచ్ రమేశ్‌గౌడ్ డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లడానికి సీసీ రోడ్డు నిర్మించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పత్తి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ గంగా భవాని, ఎంపీడీఓ హరినందన్‌రావు, ఎంపీఓ అండాలు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీలో అడ్మిషన్లు భేష్

స్పెషల్ ఆఫీసర్ కిషన్



విద్యార్థులతో మాట్లాడుతున్న కిషన్

జోగిపేట(అందోల్): 2025–26 సంవత్సరానికి గాను జోగిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 280 అడ్మిషన్లు కావడం సంతోషంగా ఉందని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంటర్మీడియేట్ స్పెషల్ ఆఫీసర్ కిషన్ అన్నారు. గురువారం జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యను అందుతుందన్నారు. ఇంటర్మీడియట్ ఒక కీలకమైన దశ అందరూ బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రిన్సిపాల్ రజిత అధ్యాపకులు శ్రీనివాస్, విఠల్, గోవర్ధన్ రెడ్డి, శ్రవణ్‌కుమార్, నూనె శ్రీనివాస్, అనిత, కమలాకర్, ప్రవీణ్ కుమార్, బాలాజీ, రాజ్‌కుమార్ గౌసుద్దీన్, నర్సింం పాల్గొన్నారు.

డబుల్ ఇళ్లను పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సంగారెడ్డి టౌన్: నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి అన్నారు. గురువారం మండల తహసీల్దార్ జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ హయాంలో మండలంలోని పసల్వాది, దాసుగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి వదిలేశారు. అధికారులు చర్యలు తీసుకొని ఇల్లు లేని వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంటయ్య, రాజు, అలీ, మల్లేశం, దుర్గయ్య పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడికతీత



పారిశుద్ధ్యం పనులు చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. పోలీస్‌స్టేషన్ ఎదుట ఉన్న మురుగు కాలువలోని పూడికను తొలగించారు. కరస్‌గుత్తి మార్గంలో రోడ్డు పక్కన పోగేసిన చెత్తను జేసీబీతో తొలగించి డంప్‌యార్డుకు తరలించారు. పలు కాలనీల్లోనూ పారిశుద్ధ్య పనులను చేపట్టారు. ఆయా పనులను కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ముమ్మరంగా విద్యుత్ మరమ్మతులు

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లు, కాలనీల్లో విద్యుత్ మరమ్మతులు మున్సిపల్ విద్యుత్ విభాగం ఇన్‌చార్జి అమర్ చేపట్టారు. వందరోజుల ప్రణాళికలో భాగంగా నిత్యం పలుకాలనీల్లో మరమ్మతు పనులు చేపడుతున్నారు. ప్రధాన రహదారితో పాటు కాలనీల్లో చెడిపోయిన ఎల్‌ఈడీ బల్బుల స్థానంలో కొత్త బల్బులను ఏర్పాటు చేశారు. కాలిపోయిన వైర్లు, ఇతర పరికరాల స్థానంలో నూతన వైర్లు, పరికరాలను అమర్చారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మరమ్మతులు నిర్వహించారు. వర్షాకాలం కావడంతో తరచూ విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతున్న దృష్ట్యా ముందస్తు జాగ్రత్తగా అన్ని మరమ్మతులు చేస్తున్నారు. పనులను మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, మేనేజర్ వెంకట శివయ్య పర్యవేక్షించారు.

కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

- ఆస్పత్రికి తరలించిన ఉపాధ్యాయులు
- ఐదు మందికి చికిత్స
- కేజీబీవీని సందర్శించిన డీఈఓ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్ కస్తూర్బాలో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. దగ్గు, జలుబుతో ఇబ్బందులు పడుతున్న ఐదుగురు విద్యార్థినులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినుల పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వివరాల ప్రకారం.. స్థానిక కేజీబీవీలో 270 మంది విద్యార్థినులు చదువుతున్నారు. బుధవారం స్వప్నబాయి, పూజ, మీనాక్షి, సాక్షి, సోనాబాయి అనే విద్యార్థినులు దగ్గు, జలుబుతో ఇబ్బందులు పడ్డారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బుధవారం రాత్రి సంగారెడ్డిలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్యం బాగానే ఉందని, అయినప్పటికీ అన్ని పరీక్షలు చేయిస్తున్నామని వైద్యులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులకు కేజీబీవీ ఇన్‌చార్జి ప్రత్యేక అధికారి సంగీత దగ్గరుండి వారికి మెరుగైన వైద్యం అందేలా చూస్తున్నారు. విద్యాలయంలో మరో ఇద్దరు విద్యార్థినులు దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారు. గురువారం విద్యాలయంలో వైద్యులు వైద్య శిబిరం నిర్వహించి రక్త పరీక్షలు చేశారు.

కేజీబీవీని సందర్శించిన డీఈఓ

జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, స్థానిక అధికారులు కేజీబీవీని సందర్శించారు. విద్యార్థినులు అస్వస్థతకు ఎందుకు గురయ్యారనే విషయాన్ని డీఈఓ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. భయపడకండి ఎవరికి ఏమీ కాదని ధైర్యం చెప్పారు. వంటగది, విద్యాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ ప్రభులు, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, ఆర్ఐ శ్యామ్‌రాం, జూనియర్ అసిస్టెంట్ సాయన్న, ఎంఈఓ మారుతి రాథోడ్ కేజీబీవీని సందర్శించి విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు విద్యార్థినులకు మాస్కులు పంపిణీ చేశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్



సమావేశంలో మాట్లాడుతున్న జర్నలిస్టులు

సంగారెడ్డి టౌన్: జర్నలిస్టుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడే సంఘం టీయూడబ్ల్యూజే (ఐజేయు) మాత్రమేనని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎకే ఫైసల్ అన్నారు. గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఫైసల్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా జర్నలిస్టుల కోసం తమ సంఘం పోరాడుతుందని చెప్పారు. మండలస్థాయి జర్నలిస్టులకు ఇంటి స్థలాలను సాధించడంలోనూ, హెల్త్ కార్డులు మంజూరులోనూ తమ సంఘం ఎంతో కృషి చేసిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో హెల్త్ కార్డుల గురించి అనేక సార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ ప్రభుత్వంలో కూడా అదే నిర్లక్ష్యం కనబడుతోందన్నారు. త్వరలో దీనిపైన ఉద్యమ కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యూనియన్ అధ్యక్షుడు బండారు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుప్రసాద్, ఎల్రక్టానిక్ మీడియా అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, ఉపాధ్యక్షుడు సిద్ధిక్, జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

మూగజీవాలకు వ్యాక్సినేషన్

ఏడీ గంగాధర్



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

నారాయణఖేడ్: వివిధ వ్యాధుల నివారణకు మూగజీవాలకు వ్యాక్సినేషన్ పూర్తి చేశామని పశుసంవర్ధకశాఖ ఖేడ్ ఏడీ డా.గంగాధర్ పేర్కొన్నారు. గురువారం ఖేడ్ పశువైద్యశాలలో మూగజీవాలకు వ్యాక్సినేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంఓ మండలంలోని జుజాల్‌పూర్, బాణాపూర్, జగన్నాథ్‌పూర్ గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలోని మదిర గ్రామాలు ఉన్నాయని అన్నారు. ఆయా గ్రామాల్లో 5 వేల మేకలు, గొర్రెలు, 1,500 గెదేలు, 350 ఆవులు ఉన్నట్లు వివరించారు. వర్షాకాలంలోవచ్చే గురకరోగం, లంపిస్కిన్, చిటుకురోగం రాకుండా వ్యాక్సినేషన్‌ను ఇదివరకే పూర్తి చేశామన్నారు. గడ్డివిత్తనాలను 75 శాతం రాయితీపై అందిస్తున్నామన్నారు. బస్తా పూర్తి ధర రూ.545 కాగా రాయి తీపోను రూ. 123లకు అందజేస్తున్నామని తెలిపారు.

కంగ్టిలో..

కంగ్టిలో పశువులకు లంపీ చర్మవ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్ డాక్టర్ ముస్తాక్ అలీ తెలిపారు. గోపాలమిత్ర తుక్కారెడ్డితో కలిసి దాదాపు 190 పశువులకు టీకాలు వేసినట్లు పేర్కొన్నారు.

వైదికుల కొరత తీర్చటమే లక్ష్యం



విద్యార్థులను సన్మానిస్తున్న పీఠాధిపతి, చైర్మన్

ఝరాసంగం(జహీరాబాద్): వైదికుల కొరత తీర్చటమే తమ లక్ష్యమని, అందుకు బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహరాజ్ ఆశ్రమ ఆవరణలో వైదిక పాఠశాలను ఏర్పాటు చేశామని ఆశ్రమ పీఠాధిపతి, మహా మండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహరాజ్ అన్నారు. గురువారం ఆశ్రమంలో ఆరు సంవత్సరాలుగా వేద శిక్షణపూర్తి చేసిన విద్యార్థులను ఘనంగా సన్మానించి, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల వారికి వేద విద్య అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దత్తగిరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం, మాతృశ్రీఅనసూయ మాత, నందినిగిరి మాత, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, శ్రీనివాస్, కృష్ణ, నాగన్న పాటిల్ పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



క్రీడాప్రాంగణాన్ని శుభ్రం చేయించిన అధికారులు

సంగారెడ్డి టౌన్: మండలంలోని కులబ్‌గూర్‌తో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు పిచ్చి మొక్కలు చెత్తతో నిండి ఉన్నాయి. బుధవారం సాక్షిలో ప్రచురించిన 'పిచ్చి మొక్కలతో క్రీడా ప్రాంగణం' కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఎంపీడీఓ యాదగిరి, సిబ్బందితో కలసి క్రీడాప్రాంగణంలోని పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేయించారు. దీంతో అక్కడ ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. స్థానిక యువకులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని మాజీ నీటి సంఘం చైర్మన్ వడ్డే నర్సింహ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెల్లాపూర్ పరిధిలోని జీబ్లాక్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను కొంతమంది కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 150 గజాలను కబ్జా చేశారని దానిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

గుర్తింపు కార్డులు నమోదు చేసుకోండి

జిన్నారం (పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రైతు గుర్తింపు కార్డుకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఓ ప్రకటనలు పేర్కొన్నారు. పీఎం కిసాన్ , ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలను పొందాలంటే రైతు గుర్తింపు కార్డు కీలకమన్నారు. కార్డు నమోదు కోసం ఆధార్ కార్డు, లింక్ ఉన్న ఫోన్ నెంబర్లతో జిన్నారం వ్యవసాయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మత్తు పదార్థాలతో హాని



టీషర్టులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ, సరేష్‌గౌడ్

జహీరాబాద్ టౌన్: మత్తు పదార్థాల నిర్మూలన అందరి బాధ్యతని జహీరాబాద్ రూరల్ ఎస్ఐ.కాశీనాథ్ అన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు 'వాకింగ్ వారియర్స్' పేరుతో మండలంలోని రంజోల్ గ్రామంలోని యువతకు షూ, టీ షర్టులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ..ముఖ్యంగా యువత మద్యం, డ్రగ్స్‌మత్తులో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మత్తు పదర్థాలు సేవించడం హానికరమని, చట్టరీత్యా నేరమన్నారు. యువత మత్తు పదర్థాలకు దూరంగా ఉండాలని కోరారు.

మాజీ కౌన్సిలర్ సన్మానం

జోగిపేట(అందోల్): జోగిపేట తూర్పుగౌని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో 17 వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబును గురువారం శాలువా, మెమోంటోతో సత్కరించారు. మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సహకరించినందుకు సన్మానించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ.. ముదిరాజ్ సంఘం అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. బుధవారం నిర్వహించిన తనిఖీల్లో 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఏడుగురికి ఒక్కొక్కరికి రూ. 1,500, మరో ముగ్గురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ పారిశుద్ధ్యం పనుల పరిశీలన

రాయికోడ్(అందోల్): గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని ఎంపీడీఓ ఎంఎం.షరీఫ్ పేర్కొన్నారు. మండలంలోని నల్లంపల్లి, మహమ్మదాపూర్, ధర్మాపూర్, యూసుఫ్‌పూర్ గ్రామాలను సందర్శించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. పంచాయతీ రికార్డులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం పనులు నిత్యం కొనసాగించాలన్నారు. తాగునీటి సరఫరాలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు ఉన్నారు.

◆ విద్యాభివృద్ధికి కృషి చేయాలి

రామచంద్రాపురం (పటాన్‌చెరు): విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ వి.భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని గీతా భూపాల్ రెడ్డి జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థులకు నోటు పుస్తకాలను, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదిమందితో ప్రారంభమైన కళాశాల నేడు వందలాది మంది విద్యార్థులతో కళకళలాడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. అధ్యాపకుల సైతం విద్యార్థులకు నాణ్యమైన విద్యని అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాట వేస్తున్నారని తెలిపారు. క్లాస్మేట్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ యువతకు ప్రాధాన్యతనివ్వాలి

జహీరాబాద్: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 25 శాతం టికెట్లను యువతకు కేటాయించాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు నాగిరెడ్డి కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పాటుపడుతున్నారన్నారు. దీనిని గుర్తించి అధిష్ఠానం టికెట్లను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, నరేష్‌బబ్లూ, జగదీశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, విష్ణు, కిరణ్ కుమార్‌గౌడ్, సుభాష్ పాల్గొన్నారు.

◆ నాలుగు టిప్పర్లు సీజ్

జోగిపేట(అందోల్): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు లారీలను సీజ్ చేసినట్లు జోగిపేట ఎస్ఐ పాండు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందోల్–జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 161 జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఓ వెంచర్‌లోకి అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు టిప్పర్ లారీని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. లారీలను సీజ్ చేయడంతో పాటు టిప్పర్ యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మట్టి రవాణా పటాన్‌చెరు సమీపంలోని కోకాపేట పరిధి నుంచి తీసుకొస్తున్నట్లు సమాచారం.

◆ వర్షాలు కురవాలని మొక్కులు

కంగ్టి(నారాయణఖేడ్): కంగ్టి ప్రజలు వర్షాల కురవాలని నిండు బిందెలతో హనుమాన్ ఆలయంలో నీరు నింపారు. గ్రామంలోని పాతబావి వద్ద పూజలు చేసి బిందెల్లో నీరు నింపుకొని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా హనుమాన్ ఆలయానికి చేరుకొని ఆలయం నీటితో నింపారు. వర్షాలు కురవాలని మొక్కుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

ఇద్దరు ఉపాధ్యాయులు గైర్హాజరు

లోకల్ హాలిడే ప్రకటించుకున్న ఉపాధ్యాయులు



తండాలో తెరుచుకోని పాఠశాల

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం దేవునిగుట్ట తండా ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతి వరకు 45 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. గురువారం ఎలాంటి పండగ లేదు. కానీ పాఠశాలలో పని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు లోకల్ హాలిడే ప్రకటించుకున్నారు. హాలిడే ఉన్న విషయం విద్యార్థులకు తెలియక పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుల కోసం ఎదురుచూసి ఇంటికి వెనుతిరిగారు. ఏడాదికి మూడు లోకల్ హాలిడేస్‌ను ఉపాధ్యాయులు ప్రకటించుకోవచ్చు. ఆ గ్రామంలో పండుగలు జాతరలు ఉంటే హాలిడే తీసుకోవచ్చు.. ఎలాంటి పండగలు లేకుండా లోకల్ హాలిడే తీసుకోవడం విడ్డూరంగా ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయమై పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్‌ను విలేకరుల ప్రశ్నించగా తనకు జ్వరం వచ్చిందని, మరో ఉపాధ్యాయురాలుకు కూడా జ్వరం వచ్చిందని ఇందుకు లోకల్ హాలిడే తీసుకున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ వెంకట్ నరసింహగౌడ్ స్పందించారు. ఎలాంటి పండగ లేకున్నా లోకల్ హాలిడే తీసుకోవడం మంచి కాదని హెచ్చరించారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



ఎల్లమ్మ ఆలయం వద్ద బోనాలతో మహిళలు



బోనాల ఊరేగింపులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను మహిళలు మట్టికుండలకు పూజించి ఊరేగింపుగా పోచమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. తొట్టెల ఊరేగింపులో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని పోతరాజుల ఆటపాటలతో కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దయతో ప్రజలందరూ సుభిక్షంగా వర్ధిల్లాలని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కంది మండల పరిధిలో..

కంది(సంగారెడ్డి): కంది మండల పరిధిలోని బ్యాతోల్‌లో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాల, శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను ఊరేగించారు. అనంతరం గ్రామదేవతలకు నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తొట్టెలను, ఫలహారం బండిని యువకులు ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శిరీష, గ్రామస్తులు రాజుగౌడ్, ప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సర్వే పనులకు నిధులు మంజూరు

కాంగ్రెస్ నాయకుడు రమేశ్‌జ్యోషి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌జ్యోషి

వట్‌పల్లి(అందోల్): కాళేశ్వరం నుంచి సింగూరు ప్రాజెక్ట్‌లోకి నీటిని తరలించేందుకు నీటి సర్వే పనులకు ప్రభుత్వం రూ.1.08 కోట్ల నిధులను మంజూరు చేయడంపై మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేశ్‌జ్యోషి హర్షం వ్యక్తం చేశారు. గురువారం వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్థానిక విలేకరులతో మాట్లాడారు. రెండు, మూడు నెలల్లో ఈ సర్వే పూర్తయితే పెద్దారెడ్డిపేట వద్ద రూ. వేయి కోట్లతో చేపట్టబోయే ఎత్తిపోతల పథకం ద్వారా నియోజకవర్గంలోని అందోల్, వట్‌పల్లి, రేగోడ్, అల్లాదుర్గ్, టేక్మాల్ మండలాల పరిధిలోని సుమారుగా 40 వేల ఎకరాలకు సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. ఇందులో వట్‌పల్లి మండలంలోని 8 వేల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా మంత్రి దామోదర పెద్దారెడ్డిపేట ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకట్‌పాటిల్, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ దిగంబర్‌రావు, మాజీ ఎంపీపీ పత్రి విఠల్, అశోక్‌గౌడ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి సత్కారం



సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

నారాయణఖేడ్: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ గురువారం సిర్గాపూర్ మండలం గైరాన్ తండాకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఆయనకు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, జిల్లా దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్‌లు తలపాగా బహూకరించి శాలువాతో సత్కరించారు. మండల బీజేపీ అధ్యక్షుడు దశరథ్ కురుమ, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ పట్నం మాణిక్, పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఏక్‌నాథ్, నాయకులు లోకేష్, వెంకట్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, పండరిలు ఘనస్వాగతం పలికారు. ఖేడ్ నియోజకవర్గంలో గిరిజన జనాభా అధికంగా ఉంటుందని వివరించారు. గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

వాగులు, నాలాల కబ్జాలపై చర్యలు లేవా!

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం

జహీరాబాద్: పట్టణం పరిధిలోని వాగులు, నాలాలు కబ్జాకు గురి కావడంతో వర్షం పడితే ఎక్కడికక్కడే నీరు స్తంభించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై.నరోత్తం విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. అధికారుల కళ్ల ముందే దర్జాగా కబ్జాలు అవుతున్నా చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. అక్రమార్కులకు అధికారులు కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. వాగులు, నాలాలు చాలా చోట్లా కబ్జాకు గురి కావడంతో వర్షం నీరు ఇళ్లలోకి చేరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల అండతోనే వర్షం నీటి ప్రవాహాన్ని కుదించి మళ్లిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శంకర్, శివకుమార్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



చేతికి అందేలా ఉన్న విద్యుత్ వైర్లు

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం గోవిందరాజుపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ పొలంలో విద్యుత్ వైర్లు చేతికందేలా వేలాడుతున్నాయి. దీంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. పొలానికి వెళ్లాలంటే చాలా చోట్ల విద్యుత్ వైర్లు లూజ్‌గా ఉండడం వల్ల ఎప్పుడు ఏం జరుగుతోందని భయపడుతున్నారు. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కొనసాగుతున్నప్పటికీ విద్యుత్ వైర్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి లూజు వైర్లను బిగించాలని రైతులు కోరుతున్నారు.